**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 12.10.2024 సమయం 1310 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1.రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ రోజు విజయదశమిని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.విజయవాడ కనక దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు**

**2.రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను 60 రోజుల్లో ముగించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.**

**3.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆర్థిక సహాయంపై అధ్యయనానికి ప్రభుత్వం కమిటీలు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.**

**4.వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు పడవచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది.**

విజయదశమి

రెండు తెలుగు రాష్ట్రాలలో విజయదశమి పండుగను ఆనందంగా భక్తి శ్రద్దలతో జరుపుకుంటున్నారు. రెండు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారు ఈ రోజు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులతో దేవీ ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ లోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు

సందర్శిస్తున్నారు.ఈ సాయంత్రం పూర్ణాహుతితో శరన్నవరాత్రులు ముగుస్తాయి. కాగా, ఈ సాయంత్రం విజయవాడ కృష్ణానదిలో కనకదుర్గమ్మకు తెప్పోత్సవం నిర్వహిస్తారు.

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగుస్తాయి. ఈ ఉదయం స్వామి పుష్కరిణిలో వేంకటేశ్వర స్వామి ప్రతిరూపంగా భావించే చక్రత్తాళ్వార్ కు పవిత్ర స్నానం నిర్వహించారు.

- డెస్క్

దసరా...కరీంనగర్

శక్తి వంతమైన సమాజ నిర్మాణం కోసం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. శక్తిమంతమైన సమాజ నిర్మాణం కోసం నిస్వార్థంగా సమష్టిగా పని చేద్దామని పిలుపునిచ్చారు. కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో ఆయన ఈరోజు శమీ పూజ నిర్వహించారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ను విశ్వగురు స్థానంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న కృషి విజయవంతంగా సాగేందుకు అమ్మవారి ఆశీస్సులతో పాటు ప్రజాసహకారం అవసరమని బండి సంజయ్ అన్నారు.

--పీటీసీ...కరీంనగర్

పొన్నం ప్రతిజ్ఞ

-ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహన చోదకులు సీటు బెల్ట్ ధారణ వంటి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామంటూ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, విజయదశమిని పురస్కరించుకుని ఈ రోజు హుస్నాబాద్ లో ప్రతిజ్ఞ చేయించారు. మద్యంతాగి వాహనాలు నడపరాదని, మన ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరులకు అపాయం కలుగకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు.

--పీటీసీ,సిద్దిపేట

మేయర్ శుభాకాంక్షలు

విజయదశమి పర్వదినం సందర్భంగా హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ భారతీయ సంస్కృతిక వారసత్వాన్ని, చెడుపై మంచి గెలుపు, అధర్మంపై ధర్మం విజయాన్ని సూచిస్తుందని ఆమె పేర్కొన్నారు. దసరా పండుగ సమాజంలో స్నేహం, ఐక్యత, శాంతి, సత్ప్రవర్తనను ప్రోత్సహించాలని కోరారు.

పీటీసీ...హైదరాబాద్

దసరా...నల్లగొండ

-నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విజయ దశమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకుంటున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ఆర్మడు రిజర్వ్ విభాగంలో ఎస్.పి శరత్ చంద్ర

పవార్ సిబ్బందితో కలిసి ఆయుధ పూజ, వాహన పూజ, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వృత్తి, వ్యాపారస్తులు, వాహనదారులు తమ పనిముట్లు, వాహనాలకు పూజలు నిర్వహించి విజయదశమి వేడుకలు జరుపుకుంటున్నారు.

-- పీటీసీ....నల్లగొండ

రాజన్న సిరిసిల్ల జిల్లా

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గత రాత్రి ఆలయ ధర్మగుండంలో తెప్పోత్సవం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి గత రాత్రి కళ్యాణోత్సవం జరిగింది. అనంతరం స్వామివారిని హంస వాహనంపై ఊరేగించారు.

--పీటీసీ....రాజన్న సిరిసిల్ల

దసరా భద్రాద్రి కొత్తగూడెం

-విజయదశమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీలక్ష్మి తాయారు ఈ వేళ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సాయంత్రం దసరా మండపంలో శ్రీరామలీల మహోత్సవం నిర్వహిస్తారు.

--పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం

దసరా జనగామ

-జనగామ జిల్లాలోని పోలీసు స్టేషన్ లో విజయదశమి సందర్భంగా ఆయుధపూజ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ సాయంత్రం రావణవధ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

--పీటీసీ, దసరా జనగామ

ఇంటింటి సర్వే

-రాష్ట్రంలో సమగ్ర కుంటుంబ సర్వే ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు నిన్న ఆదేశాలు జారీ చేసింది. సర్వే బాధ్యతను నోడల్ విభాగం ప్రణాళిక శాఖకు అప్పగించింది. ప్రజల సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాల మెరుగుదలకు ఈ సర్వే చేపట్టాలని శాసనసభ ఆమోదం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇంటింటి సర్వే తరువాతే స్థానిక ఎన్నికలకు వెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాగా, కులగణనకు సమగ్ర సర్వేకు ప్రభుత్వం ఉత్తర్వులు చేయడం పట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

--డెస్క్

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు

-రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయానికి సంబంధించి కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పురపాలక సంఘాల, గ్రామ పంచాయతీ వార్డు స్థాయిలో ఈ కమిటీలు ఏర్పాటవుతాయి. పురపాలక సంఘం వార్డు స్థాయి కమిటీలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్ గా, వార్డు అధికారి కన్వీనర్ గా ఉంటారు. గ్రామ పంచాయతీ కమిటీలో సర్పంచ్ లేదా ప్రత్యేకాధికారి చైర్మన్ గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్ గా ఉంటారు. రెండు

రకాల కమిటీల్లో స్థానికులు ముగ్గురు, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు కమిటీలోసభ్యులుగా ఉంటారని ఆ ఉత్తర్వులు పేర్కొన్నాయి.

-- డెస్క్

ఎస్సీ వర్గీకరణ

-రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల వర్గీకరణపై సమగ్ర అధ్యయనం కోసం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటైంది. కమిషన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అరవై రోజులలోగా అధ్యయన నివేదిక అందచేయాలని ప్రభుత్వం కోరింది.

-- డెస్క్

డిస్కంలు-బదిలీలు

-రాష్ట్ర విద్యుత్ డిస్కంలలో సిబ్బంది సాధారణ బదిలీల ప్రక్రియపై ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీటి ప్రకారం, వచ్చే నెల 11వ తేదీ నాటికి బదిలీ ఉత్తర్వుల జారీ ప్రక్రియ పూర్తి కావలసి ఉంది. ఆ మరునాడు....12 నుంచి బదిలీలపై నిషేధం అమలులోకి వస్తుంది. గత నెల 27వ తేదీన జారీ అయిన ఉత్తర్వులలో ఈ రెండు తేదీలను వచ్చే నెల 8, 9 గా నిర్ణయించాయి. అయితే మార్గదర్శక సూత్రాల జారీలో జాప్యం కారణంగా తేదీలను సవరిస్తూ డిస్కంలు గత రాత్రి తాజాగా ఆదేశాలు జారీ చేశాయి.

--డెస్క్

స్కిల్ వర్శిటీ

-రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో మూడు కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ తెలంగాణ పరిశ్రమలు,

వాణిజ్యశాఖ ప్రకటన వెలువరించింది. స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్ అండ్ ఈ-కామర్స్, స్కూల్ ఆఫ్ హెల్త్ కేర్, స్కూల్ ఆఫ్ ఫార్మాసూటికల్ అండ్ లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29వ తేదీ తుది గడువు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్.సైట్ www.yisu.in సంప్రదించవచ్చు. వచ్చే నెల 4 నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. తరగతులను తాత్కాలిక ప్రాతిపదికపై హైదరాబాద్ లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, నేషనల్ అకాడమి ఆఫ్ కనస్ట్రక్షన్ ప్రాంగణాల్లో నిర్వమిస్తారని ప్రభుత్వం తెలిపింది.

--డెస్క్

వాతావరణం

-రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఈరోజు, రేపు ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమరం భీం, మంచిర్యాల, నిర్మల్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, గంటకు సుమారు 40 కిలో మీటర్ల వేగంగా ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

- డెస్క్

జేఎన్టీయూ రీసెర్చి

విశ్వవిద్యాలయంతో పాటు దాని అనుబంధ కళాశాలల్లో కూడా పీహెచ్ డీ పరిశోధనకు అవకాశం కల్పించాలని జవహార్ లాల్ నెహ్రూ సాంకేతిక విశవిద్యాలయం-జేఎన్టీయూ- నిర్ణయించింది. ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలు

కల్పించేలా నోటిఫికేసషన్లు జారీ చేయాలని కూడా నిర్ణయించింది. ఈ పరిశోధన కేంద్రాలను విశ్వ విద్యాలయ సలహా కమిటీ పర్యవేక్షిస్తుంది. మూడేళ్లలో పరిశోధన పూర్తి చేసిన వారు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి అర్హత కల్పించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. బయోటెక్నాలజీ, ఇంజనీరింగ్, కృత్రిమ మేధ, వ్యవసాయం, వైద్యంలో పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉండడంతో విశ్వవిద్యాలయం ఈ ప్రతిపాదన చేసిందని జేఎన్టీయూ రిజిస్ట్రార్ ఆచార్య కె. వెంకటేశ్వరరావు తెలిపారు. డెస్క్

శబరిమల

-శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో దర్శనానికి భక్తులను ఇకపై రోజుకు 17 గంటల అనుమతిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. మండలం మకరవిళక్కు సీజన్ సందర్భంగా తెల్లవారుజామున 3 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని వివరించారు. అయితే భక్తులు ముందుగా ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

--ఎఫ్.ఎం..డెస్క్